# ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా

## బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం

భద్రాచలం, నవంబర్ 4: ఒక్కసారి ఆశీర్వదిస్తే భద్రాచలం నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావు అన్నారు. శనివారం ఆయన బీఆర్ఎస్ నాయకులతో కలిసి భద్రాచలం పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రజలు వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ, బీజేపీని నమ్మి మోసపోవద్దన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే రాష్ట్రం మళ్లీ అంధకారంలోకి వెళ్తుందన్నారు. కర్ణాటకలో పంటలకు 24 గంటలు కరెంట్ ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక ఆ పార్టీ ఇప్పుడు కేవలం మూడు గంటలు మాత్రమే కరెంట్ ఇస్తున్నదన్నారు. వైద్యుడిగా తాను ఎంతోమంది నిరుపేదలకు వైద్యం చేశానని, అలాగే ప్రజాప్రతినిధిగా గెలిపిస్తే మరిన్ని సేవలు అందిస్తానన్నారు. గ్రామగ్రామాన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. ప్రచారంలో పార్టీ మండల అధ్యక్షుడు అరికెల్ల తిరుపతిరావు, నాయకులు మానె రామకృష్ణ, దారపునేని రాంబాబు, తాళ్లపల్లి రమేష్ పాల్గొన్నారు.


శాంతినగర్‌కాలనీలో మ్యానిఫెస్టో గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తెల్లం


ఇస్త్రీ చేస్తున్న తెల్లం వెంకట్రావు


ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన ఎమ్మెల్సీ తాతా మధు


మారాయిగూడెం బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

### రాష్ట్రంలో అభివృద్ధిని చూసి ఓటేయ్యండి

#### ఎమ్మెల్సీ తాతా మధు, తెల్లం వెంకట్రావు

భద్రాచలం, నవంబర్ 4 : రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌కు ఓటేయ్యాలని ఎమ్మెల్సీ, భద్రాచలం నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి తాతా మధుసూదన్, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో వాకర్స్‌తో వారు మాట్లాడారు. రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఏ రాష్ట్రంలో కూడా అమలుకావడం లేదన్నారు. సీఎం కేసీఆర్ ఇటీవల విడుదల చేసిన మ్యానిఫెస్టో సామాన్యులకు కూడా మేలు కలుగజేసేదిగా ఉందన్నారు. ముచ్చటగా మూడోసారి సీఎం కేసీఆర్ ముఖ్యమంత్రి పదవిలో కొనసాగుతారని స్పష్టంచేశారు. అధికార పార్టీ అభ్యర్థిగా తెల్లం వెంకట్రావు విజయంతో భద్రాచలం నియోజకవర్గం మరింతగా అభివృద్ధి చెందుతుందన్నారు. గత పదేళ్లుగా ప్రతిపక్ష ఎమ్మెల్యేలు భద్రాచల నియోజకవర్గం గురించి ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. భద్రాచలం సమస్యలపై వాకర్స్‌తో కాసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు అరికెల్ల తిరుపతిరావు, కొండిశెట్టి కృష్ణమూర్తి, రైతుబంధు సమితి అధ్యక్షుడు దారపునేని రాంబాబు, శంకర్‌రావు, పద్మనాభుని వాసు, ఎండీ నవాబ్, రత్నం రమాకాంత్ పాల్గొన్నారు.

### శ్రీనివాస్‌ను కలిసిన ఎమ్మెల్సీ మధు

భద్రాచలం, నవంబర్ 4 : ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు చారుగుళ్ల శ్రీనివాస్‌ని ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల గురించి చర్చించుకున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి విజయానికి కృషిచేయాలని కోరగా, తమ సంఘం తరపున బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపునకు కృషిచేస్తానని శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమలో బీఆర్ఎస్ నాయకులు తాండ్ర రమణారావు, రేపాక పూర్ణ, తాండ్ర నర్సింహారావు, బొలిశెట్టి రంగారావు, తాళ్లపల్లి రమేశ్‌గౌడ్ పాల్గొనగా ఆర్యవైశ్య సంఘ సభ్యులు చింతల వినోద్, ఉడతా నగేశ్‌కుమార్, సంకా కృష్ణార్జునరావు, ఉప్పుటూరి రాధాకృష్ణ, పసుమర్తి సత్యనారాయణ, చారుగుళ్ల గిరి, చవ్వా శంకర్ పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

దుమ్ముగూడెం, నవంబర్ 4 : ఛత్తీస్‌గఢ్ సరిహద్దు గ్రామమైన మారాయిగూడెం, సింగవరం గ్రామాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావు గెలుపు కోరుతూ బీఆర్ఎస్ నాయకులు శనివారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టి అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతోపాటు వాల్‌పోస్టులు, మ్యానిఫెస్టో కరపత్రాలను ఇంటింటికీ పంచుతూ బూత్ కమిటీల ఆధ్వర్యంలో ప్రచారాన్ని జోరుగా నిర్వహించారు. నియోజకవర్గం రానున్న ఎన్నికల్లో గెలిపిస్తే తెల్లం మరింత అభివృద్ధి చేస్తారని, స్థానికంగా ఉన్న వ్యక్తి అందరికీ సుపరిచితుడైన తెల్లంను అఖండ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ప్రచారంలో నాయకులు వీర్రాజు, సలీమ్ పాల్గొన్నారు.

## క్రికెట్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

భద్రాచలం, నవంబర్ 4 : ఉమ్మడి ఖమ్మంజిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశా క్రీడా మైదానంలో జరుగుతున్న అండర్-17 క్రికెట్ జట్ల ఎంపికలో శ్రీభద్రాద్రి క్రికెట్ అకాడమీ విద్యార్థులు శనివారం ఎంపికయ్యారు. విషయం తెలుసుకున్న భద్రాచలం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. అండర్-17 బాలుర జట్టులో కుంచాల సాయి తనిష్క్, ఎస్ గురువిద్వాన్ అద్భుత ప్రతిభ కనబర్చారు. బాలికల అండర్-17 జట్టుకు పీ వైష్ణవి రత్న, టీ అమృత, టీ సహస్ర, బీ దీక్షిత, జీ నేహా ప్రతిభ కనబర్చారు. అంతర్ జిల్లా క్రికెట్ టోర్నమెంట్‌లో విజయం సాధించి జిల్లాకు పేరు తేవాలని తెల్లం ఆకాంక్షించారు.

## వాజేడులో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్




వాజేడు, నవంబర్ 4 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు ఏజెన్సీలో అప్రమత్తమయ్యారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ముందస్తు చర్యలు చేపట్టారు. శనివారం ఎస్పీ గౌస్ ఆలం నేతృత్వంలో వాజేడు మండలకేంద్రంలో పోలీసులు, సీఆర్పీఎఫ్ బలగాలు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ప్రజలు ప్రశాంతమైన వాతవారణంలో ఓటుహక్కు వినియోగించుకోవాలని ఎస్పీ పిలుపునిచ్చారు. చెరుకురు గ్రామంలో పోలింగ్ కేంద్రాన్ని ఎస్పీ పరిశీలించి అధికారులకు పలు సూచనలను చేశారు. కార్యక్రమంలో ఏటూరునాగారం ఏఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, సీఆర్పీఎఫ్ డీఎస్పీ సహిర్‌ఆలీ, వెంకటాపురం సీఐ బండారు కుమార్, వాజేడు, పేరూరు ఎస్సైలు వెంకటేశ్వర్లు, గోర్ల రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

## పారిశుధ్య పనుల్లో అలసత్వం వద్దు : ఏజీఎం సివిల్

రామవరం, నవంబర్ 4 : పారిశుధ్య పనుల్లో అలసత్వం వహించవద్దని, ఏ రోజు పనులు ఆ రోజే పూర్తి చేసుకోవాలని, అశ్రద్ధ వహిస్తే ఊరుకునేదిలేదని కొత్తగూడెం ఏరియా ఏజీఎం సివిల్ రామకృష్ణ హెచ్చరించారు. శనివారం ఏరియాలో జరుగుతున్న పనులను డీవైఎస్ఈ అచ్యుత రామయ్యతో కలిసి పరిశీలించి సూచనలు చేశారు. రుద్రంపూర్ మార్కెట్ ఏరియాలో పనులు చేస్తున్న వారితో మాట్లాడారు. సింగరేణి యాజమాన్యం సుమారు రూ.4 లక్షల వ్యయంతో నిర్మించిన సులభ్ కాంప్లెక్స్‌ను శుభ్రం చేయడం లేదని, వారాంతపు సంతకు వచ్చే మహిళలు, వ్యాపారులు, షాపుల యజమానులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎంపీటీసీ ఇళ్ల పరమేశ్ అధికారులకు చెప్పారు. మార్కెట్ సెంటర్‌లో ఉన్న స్టేజి పూర్తిగా ధ్వంసమైపోయిందని, స్టేజిని నిర్మించాలని కోరగా సంబంధిత సమస్యలను ఏరియా జీఎం శాలెంరాజు దృష్టికి తీసుకెళ్లాలని, జీఎం ఆదేశాల మేరకు తదుపరి పనులు చేపడతామని చెప్పారు. వారివెంట సూపర్‌వైజర్ కల్యాణ్, సివిక్ ప్రైవేట్ సూపర్‌వైజర్ ఆంజనేయులు, వ్యాపారులు శేఖర్, మోహన్, సాంబయ్య, శ్రీనివాస్, రాము ఉన్నారు.

## వనమా గెలుపు కోసం కృషిచేయాలి

### టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావు


మాట్లాడుతున్న వెంకట్రావ్

రామవరం, నవంబర్ 4 : కోల్ బెల్టు ప్రాంతమైన కొత్తగూడెం నియోజకవర్గ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బి.వెంకట్రావు అన్నారు. సింగరేణి కొత్తగూడెం ఏరియా పీవీకే 5 గనిలో శనివారం జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ కార్మికుల మీద ఉన్న ప్రేమతో కారుణ్య నియామకాల ద్వారా తండ్రీకొడుకుల ఉద్యోగాలు, కార్మికుల ఇండ్లకు ఏసీ సౌకర్యం, వన్ పర్సెంట్ కరెంట్ బిల్లుల రద్దు లాంటి అనేక హక్కులను కల్పించారని, కేసీఆర్‌ని మూడోసారి సీఎంగా చేయడం కోసం నియోజకవర్గంలో ఎమ్మెల్యేను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్, కాపు కృష్ణ, కూసన వీరభద్రం, బూటుక రాజేశ్వరరావు, చిలక రాజయ్య, గౌస్, నాగేశ్వరరావు, శంకర్, శ్రీనివాస్, చిరంజీవి పాల్గొన్నారు.

## రామయ్యకు స్వర్ణ తులసి పూజలు



భద్రాచలం, నవంబర్ 4: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో శనివారం అర్చకులు స్వర్ణ తులసి పూజలు నిర్వహించారు. అర్చకులు తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్య పూజలు, నిత్య హోమాలు, నిత్య బలిహరణం చేపట్టారు. కల్యాణంలో పాల్గొన్న దాతలకు అర్చకులు స్వామివారి ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు.

## కనుల పండువగా పునర్వసు కల్యాణం


కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

పర్ణశాల, నవంబర్ 4: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయానికి అనుబంధ ఆలయమైన పర్ణశాల రామయ్య ఆలయంలో శనివారం అర్చకులు మూలవరులను నూతన వస్త్రాలు, ఆభరణాలతో అలంకరించి పునర్వసు కల్యాణ వేడక నిర్వహించారు. వేడుకలో అ ధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పూజల్లో శే ష కిరణ్‌కుమార్‌చార్యులు, శ్రీకాంత్‌చార్యులు, నరసింహాచార్యులు పాల్గొన్నారు.

## గోశాల నిర్మాణానికి వితరణ


గోశాల నిర్మాణానికి రూ.లక్ష అందజేసి రశీదును స్వీకరిస్తున్న దాత సాంబశివరావు, కుటుంబ సభ్యులు

భద్రాచలం, నవంబర్ 4 : భద్రాచలం సీతా రామచంద్రస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే గోశాల నిర్మాణానికి ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలానికి చెందిన సాంబశివరావు, సుభద్ర దంపతులు రూ.లక్ష వితరణ చేశారు. శనివారం సాయంత్రం స్వామివారిని దర్శించుకొని అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థానం ఈవో ఎల్.రమాదేవికి రూ.లక్ష అందజేసి రశీదు స్వీకరించారు.

## కలప పట్టివేత

పర్ణశాల, నవంబర్ 4 : మండలంలోని పెద్ద కమలాపురం గ్రామం వద్ద ఆటోలో తరలిస్తున్న కలపను పట్టుకున్నట్లు దుమ్ముగూడెం రేంజర్ కనకమ్మ శనివారం తెలిపారు. శుక్రవారం రాత్రి ఇద్దరు వ్యక్తులు ఆటోపై 14 టేకు దిమ్మలను అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం అందగా సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించి కలపను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ రూ.లక్ష ఉంటుందని పేర్కొన్నారు. సదరు వ్యక్తులు ఆటో, కలపను వదిలేసి పారిపోయినట్లు తెలిపారు.

## భద్రాచలంలో తొలి నామినేషన్ దాఖలు

భద్రాచలం, నవంబర్ 4: భద్రాచలం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయదల్చిన నామినేషన్ దాఖలు చేసేందుకు కలెక్టర్ ప్రియాంక ఆల భద్రాచలం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయాన్ని కేటాయించారు. రిటర్నింగ్ అధికారిగా మంగీలాల్ (ఆర్డీవో)ను నియమించారు. నియోజకవర్గం నుంచి తొలి రోజు శుక్రవారం ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. రెండోరోజు శనివారం స్వతంత్ర అభ్యర్థిగా చర్లకు చెందిన పాండ్రు హేమసుందర్ నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ వేసే అభ్యర్థితో పాటు మరో నలుగురికి మాత్రమే లోపలికి అనుమతి ఉంటుంది. నామినేషన్ దాఖలు చేసేందుకు అభ్యర్థులకు ఈ నెల 10వ తేదీ వరకు అవకాశం ఉంది. ప్రతిరోజు ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతుంది.

## నేడు నామినేషన్లు స్వీకరించబడవు

కొత్తగూడెం టౌన్, నవంబర్ 4 : ఈ నెల 5వ తేదీ ఆదివారం ప్రభుత్వ సెలవు అయినందున నామినేషన్లు స్వీకరించబడవని కలెక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. ఈ నెల 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, ఉదయం 11 నుంచి సాయంత్రం 3గంటల వరకు స్వీకరిస్తారని పేర్కొన్నారు. తొలిరోజు కేవలం మూడు నామినేషన్లు మాత్రమే దాఖలయ్యాయని తెలిపారు. 4వ తేదీ శనివారం రెండోరోజు పినపాక నియోజకవర్గంలో 1, ఇల్లెందు నియోజకవర్గంలో 2, కొత్తగూడెం నియోజకవర్గంలో 2, అశ్వారావుపేట నియోజకవర్గంలో 1, భద్రాచలం నియోజకవర్గంలో 1 మొత్తం ఏడుగురు నామినేషన్లు దాఖలు చేసినట్లు పేర్కొన్నారు.